క్లుప్తంగా

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

తెనాలిఅర్బన్: అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణ, పీఎల్‌జీ సూర్యప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఆచార్య గుజ్జర్ల మూడి కృపాచార్యులు పాల్గొంటారన్నారు. అందరూ పాల్గొనాలని కోరారు.

నేడు బూత్‌లెవల్ నాయకుల ఆత్మీయ సమావేశం

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం బూత్‌లెవల్ నాయకుల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించను న్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు మిర్చియార్డు రోడ్డులోని వైజంక్షన్ వద్ద ఉన్న వీఆర్‌కే కన్వెన్షన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్త ఉమ్మారెడ్డి వెంకటరమణ పాల్గొంటారని తెలిపారు.

ఓటు విలువపై అవగాహన

గుంటూరు రూరల్: ఓటు నమ్మకమైన నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రజలకున్న వజ్రాయుధం ఓటు హక్కు అని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం ఏఎస్‌యూ, చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు లాం గ్రామంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

యువతి అదృశ్యం



పెదకాకాని: మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పెదకాకాని సుందరయ్యకాలనీకి చెందిన షేక్ నన్నీబి మస్తాన్ దంపతులకు నలుగురు సంతానం. వారిలో మూడో కుమార్తె షేక్ రంజాన్‌బీకి చిన్నతనం నుంచి మతిస్థిమితం లేదు. చిన్నపిల్లలాగా ఇంటి పక్కల ఉన్న వారితో ఆడుకుంటూ ఉంటుంది. సోమవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో కాలనీలో కనిపించలేదు. చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల్లో విచారించినప్పటికీ ఆచూకీ కనిపించలేదు. దీంతో రంజాన్‌బీ తల్లి నన్నీబీ పెదకాకాని పోలీసులను ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

నవజాత శిశు మరణాలపై దృష్టి పెట్టండి

గుంటూరు మెడికల్: నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ కోరారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నవ జాతా శిశు సంరక్షణ అవసరం అంశంపై మంగళవారం సింపోజియం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవ జాతా శిశువుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. నవజాత శిశువుల జననానికి ముహూర్తాలు నిర్ణయించి ఆపరేషన్లు చేయాలని తల్లిదండ్రులు కోరుకోవడం బాధాకరమన్నారు. విద్యావంతులు కూడా అవగాహనా లేకుండా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆధునిక వైద్యాన్ని అభ్యసించి వైద్యులు ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధా రమణ శ్రీ, శాంత కుమారి పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట 2/7లోని శ్రీ గౌరి విశ్వేశ్వర స్వామి దేవాలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విశ్వేశ్వర శర్మ దంపతులతో కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సీతారామాంజనేయులు, సీతారత్న కుమారి, ఉప్పులూరి గణేష్, కుమారి దంపతులు పాల్గొన్నారు. అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్ కుమార్ శర్మ, మల్లికార్జున శర్మ, చక్రపాణి, కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తోపుడు బండి అందజేత

గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో ఒక నిరుపేద వ్యక్తికి జీవనోపాధి కోసం తోపుడు బండిని గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్, దాత సహాయం చేశారు. స్థానిక కోబాల్ట్ పేటలో డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో మంగళవారం తోపుడు బండిని అందజేశారు. గుంటూరు నగరంలో నిరుపేదలకు జీవనోపాధి కోసం తోపుడు బండి, కుట్టు మెషిన్ కావాల్సిన వారు గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ వారి సెల్ 8143222456, 9397602553 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థను దెబ్బతీయలేరు

- వలంటీర్ వ్యవస్థపై అక్కసు వెళ్లగక్కుతున్న ప్రతిపక్షాలు
- ఎన్ని చేసినా రాజకీయ అధికారం మీకు కల్ల
- వలంటీర్లకు వందనంలో ప్రతిపక్షాల నేతలపై ఎమ్మెల్యే శివకుమార్ ధ్వజం



పులివర్తి శిరీషకు సేవా వజ్ర పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అద్భుతంగా పనిచేస్తున్న వలంటీరు వ్యవస్థపై అక్కసుతో ప్రతిపక్షాలు తీవ్ర వ్యతిరేకతను పెంచుకున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తీవ్రమైన ఆరోపణలు చేస్తూ నీచరాజకీయాలకు పాల్పడుతున్నారని, వలంటీరు వ్యవస్థను దెబ్బతీయటం ప్రతిపక్షాల వల్లకాదని, అధికారం అనేది వారికి కలగానే మిగిలిపోతుందని స్పష్టం చేశారు. పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 21–40 వార్డులకు వలంటీర్లకు వందనం మంగళవారం స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ జనసేన జేఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వలంటీర్ వ్యవస్థపై చేసిన విమర్శలపై తీవ్రంగా స్పందించారు. అతి చిన్న వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చినపుడు 7.92 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని మనోహర్ అన్నారంటూ, 'మీరు పొత్తుపెట్టుకున్న టీడీపీ అధికారంలో ఉన్నపుడు నిరుద్యోగాన్ని పెంచి పోషించిన ఫలితమే' నంటూ తిప్పికొట్టారు. ఇస్తానన్న నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదన్నారు. ఫలితంగానే ప్రభుత్వం మారగానే వలంటీరు ఉద్యోగానికి లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. వలంటీర్లకు శిక్షణ కోసం కోట్లు ఖర్చు చేశారంటూ మనోహర్ చేసిన ఆరోపణను కొట్టి వేశారు. మోసం, అబద్ధమే రాజకీయం అని నమ్మేవాళ్లు మీరని, అందుకు విరుద్ధంగా తాను రాజకీయం చేస్తానని వ్యాఖ్యానించారు. శిక్షణ లేకుండా ఏ వ్యవస్థ అయినా ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటే ప్రతిపక్షాలకు ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వీళ్ల జీవితాలు, బతుకులు, రాజకీయాలు.. అన్నీ స్కీములు, స్కాములేనని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలో ఇచ్చే ప్రతి రూపాయి నేరుగా లబ్ధిదారుడికి చేరుతోందని గుర్తు చేశారు. దీనికి కారణమైన వలంటీర్ల వ్యవస్థను రాజకీయాలకు బలిచేయాలని చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వలంటీర్ల వ్యవస్థ అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేసినందునే ప్రజలెవ్వరూ ప్రతిపక్ష నేతల మాటల్ని, పచ్చమీడియా రాతల్ని నమ్మటం లేదన్నారు. ఇటీవల వలంటీర్లకు వందనంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు భవిష్యత్ నాయకులని చాలా స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ప్రజలతో ఎవరైతే మమేకమవుతారో, సేవలతో పురస్కారాలను పొందుతారో, వారందరికీ రాజకీయ వేదిక కల్పించాలనే భావన సీఎం మాటల్లో వ్యక్తమైందని అన్నారు. ఆ అవకాశాలను అందిపుచ్చుకొని మీ పాత్రను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మాజీ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, మున్సిపల్ కమిషనర్ బండి శివన్న, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, తాడిబోయిన రామయ్య, రావి రాంబాబు, యాతాటి అనిల్, కొమరాబత్తుని జయపాల్, జి.మానసారెడ్డి, మట్లపూడి సంధ్యారాణి, పేరం సంజీవరెడ్డి, గొడవర్తి సాయిహరేరామ్, వీర్లపాటి విజయలక్ష్మి, జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, బండ్లమూడి భాస్కరరావు, పార్టీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఉడుముల మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలను ఎమ్మెల్యే ప్రదానం చేశారు. పులివర్తి శిరీషకు సేవా వజ్ర, 8 మందికి సేవారత్న, 879 మందిని సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు.

మురుగు పారుదల జరిగే విధంగా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న చైర్మన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వల్లో పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 34వ వార్డులో మంగళవారం ఆమె, కమిషనర్ బండి శేషన్నతో కలసి పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ఉదయం పర్యటించడం జరుగుతుందన్నారు. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వలన అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వాటిని బాగు చేయించేందుకు కనీసం రెండు, మూడు రోజులు పడుతుందని చెప్పారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ పట్టణంలోని అన్ని మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు చెప్పారు. చెత్తను కాల్వల్లో వేయవద్దని సూచించారు. వారి వెంట కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, తదితరులున్నారు.

ఈ క్రాప్ నమోదు చేసిన పొలాల పరిశీలన



బుర్రిపాలెంలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏవో వెంకటేశ్వర్లు

తెనాలిటౌన్: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించి ఈ కెవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. రూరల్ మండలం నేలపాడు, బుర్రిపాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు ఈ క్రాప్ నమోదు చేస్తున్న పొలాలను సందర్శించి, నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. రైతులు తమ పొలాలను ఈ క్రాప్ చేయించుకుని ఆర్‌బీకేలలో ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ జాబితాలో ఉండి ఆధార్‌కు బ్యాంకు ఖాతా లింక్ కానీ వారు బ్యాంకు మేనేజర్‌ను కలిసి ఆధార్‌కు బ్యాంకు ఖాతాను నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ మండల గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా ఈ కెవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో జి.మోహనరావు, వీఏఏలు కె.హర్దిష్ వర్మ, పి.దీప్తి, రైతులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నాటికల పోటీలు



భానుమతి, కుర్రా శ్రీనులను సత్కరిస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు



క్షేత్రం నాటికలో సన్నివేశం

- సేవా రంగ ప్రముఖులకు ఆత్మీయ సన్మానం
- ప్రేక్షకులను ఆలోచింపజేసిన క్షేత్రం నాటిక

తెనాలిటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పరిషత్ పోటీలు జరుగుతున్నాయి. పోటీలలో తొలుత బసవరాజు జయశంకర్ పర్యవేక్షణలో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారి 'బహురూపి' నాటికను ప్రదర్శించారు. శిష్ట్లా చంద్రశేఖర్ రచించిన ఈ నాటికకు కె.వి.ప్రసాద్ దర్శకత్వం వహించారు. పట్టణంలో సేవా రంగ ప్రముఖులు అయిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి బ్రాంచి చైర్మన్ ఉమ్మలనేని భానుమతి, శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీనులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం రెండో ప్రదర్శనగా ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి 'క్షేత్రం' నాటికను ప్రదర్శించారు. శిల్ప ఆకురాతి రచన చేయగా జి.మనోహర్ దర్శకత్వం వహించారు. సాంఘిక నాటక రంగంపై సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, ప్రముఖ నాటక రచయితలు డాక్టర్ చిలువూరు నాగేశ్వరరావు, ఆకురాతి భాస్కర్ చంద్రలు సమీక్ష జరిపారు. అనంతరం తృతీయ ప్రదర్శనగా కళావర్షిణి హైదరాబాద్ వారి 'అజరామరం' నాటికను ప్రదర్శించారు. హరిబాబు జెట్టి రచన, దర్శకత్వం వహించారు. మూడు నాటికల పోటీల కళాకారులకు ప్రదర్శన పారితోషకాన్ని ప్రణాళిక శాఖ ఉప కార్యదర్శి ఎ.వి.సుబ్బారావు, కావూరి సత్యనారాయణలు అందజేశారు. నాటక కళా పరిషత్ నిర్వాహకులు ఆరాధ్యుల కన్నా, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి, పిట్టు వెంకట కోటేశ్వరరావు, కళాకారుల సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, తదితరులు పర్యవేక్షించారు.

చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు

- జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి.తారాసత్యవతి
- కొల్లిపర మండలం దావులూరులో 11 రకాల సజ్జ, 10 రకాల జొన్న సాగు పరిశీలన



సజ్జ పైరును పరిశీలిస్తున్న డాక్టర్ సి.తారాసత్యవతి, డాక్టర్ సుబ్బారాయుడు, రైతులు

తెనాలి: వరి, గోధుమలకు మించిన పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని హైదరాబాద్‌లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి చెప్పారు. ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో కొల్లిపర మండలం దావులూరులో 11 రకాల సజ్జ, 10 రకాల జొన్న పంటను సాగుచేసిన అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్ పంటపొలాన్ని మంగళవారం సందర్శించారు. ఏపుగా పెరిగిన ఆయా రకాలను రైతులకు చూపారు. అక్కడే చిరుధాన్యాల ఆవశ్యకతను, సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో రైతులకు అధిక ఆదాయంతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారం లభిస్తుందన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఆ పంటల సాగు పెరుగుతోందని, దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పెరిగిందన్నారు. డెల్టాలో ఖరీఫ్ వరి సాగు తర్వాత జొన్న, సజ్జతో పాటు ఇతర చిరుధాన్యాలను జీరో టిల్లేజ్ విధానంలో సాగు చేపట్టాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడి ప్రాసెసింగ్ చేసుకుని అమ్మగలిగితే మరింత ఆదాయం లభిస్తుందని చెప్పారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుబ్బారాయుడు తన ప్రసంగంలో, ఐఐఎంఆర్ 11 రకాల సంకరజాతి జొన్న విత్తనాలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇక్కడి రైతులు సాగుచేసే జొన్నలో ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే, ఐఐఎంఆర్ రకాల్లో 40–50 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయన్నారు. అధ్యక్షత వహించిన 'ఆత్మ' ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ, లాభదాయకంగా ఉంటుందనే భరోసా ఇవ్వగలిగిన రకాలను అందిస్తే, విజయవంతం కాగలవన్నారు. అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్ మాట్లాడుతూ ఐఐఎంఆర్ ఇచ్చిన 11 రకాల సజ్జ, ఆరు జొన్న రకాలతోపాటు వ్యవసాయశాఖ రెండు, తన సొంతంగా మరో రెండు రకాల మొత్తం 21 రకాల సజ్జ, జొన్న పంటలను సాగుచేసినట్టు తెలిపారు. లాం ఫారం చిరుధాన్యాల శాస్త్రవేత్త డాక్టర్ పుష్పరేణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి మాట్లాడారు. కొల్లిపర వ్యవసాయాధికారి వెంకట్రావు స్వాగతం పలికారు. రైతులు, వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో జీవితంలో ఏదైనా సాధించగలం

జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్



మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్ సుబ్బారావు, వేదికపై జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టుదలతో జీవితంలో ఏదైనా సాధించగలమని జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని జూబిలేషన్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలనే గట్టి సంకల్పం, దానిని తగిన కృషి తోడైతే కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకోగలమని అన్నారు. ఈసందర్భంగా టెన్త్ పరీక్షల్లో తప్పిన తాను మరలా కసితో పరీక్షలకు సన్నద్ధమై విజయం సాధించడంతో పాటు గ్రూప్–1 సాధన వరకు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్ టీవీ సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలలో టెన్త్ పూర్తి చేసుకున్న వెళ్లిన పూర్వ విద్యార్థుల విజయగాథలను వివరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎస్.శ్రీనివాసరావు, హిందూ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

చిదంబర శాస్త్రి దంపతులకు పురస్కారం



చిదంబర శాస్త్రి దంపతులకు పురస్కారం ప్రదానం చేసిన నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతజాతి చిరకాల స్వప్నమైన శ్రీరామ మందిరం ఇన్నేళ్లకు సాకారమైందని హనుమ ఆధ్యాత్మిక కేంద్ర వ్యవస్థాపకుడు డాక్టర్ అన్నదానం చిదంబరశాస్త్రి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మంగళవారం చెరువు సూర్యనారాయణమూర్తి–సీతారావమ్మ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చిదంబరశాస్త్రి దంపతులను పురస్కారంతో సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన హిందూ కాలేజీ హైస్కూల్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ చిదంబరశాస్త్రి భారతీయ సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షిస్తున్నారని, ఆయన రచనలు పలువురిని చైతన్య భరితం చేసినట్లు చెప్పారు. కార్యదర్శి కేవీఎస్ఆర్ కుటుంబరావు మాట్లాడుతూ చెరువు సూర్యనారాయణ మూర్తి– సీతారావమ్మ పేరిట ఏర్పాటు చేసిన పురస్కార పూర్వ గ్రహీతలను పరిచయం చేస్తూ, సూర్యనారాయణ మూర్తి విద్యా సేవలను కొనియాడారు. హిందూ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ దీవి నరసింహ దీక్షితులు మాట్లాడుతూ చిదంబర శాస్త్రి సాహిత్య సేవలు, భారతీయ ధర్మాన్ని ప్రచారం చేస్తున్న తీరు వివరించారు. చెరువు సత్య నారాయణ మూర్తి, డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, జూపూడి రంగరాజు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, బండ్లమూడి హనుమాయమ్మ కళాశాల కార్యదర్శి కర్పూరపు శాంతి భూషణ్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

పట్నంబజారు: నివాసంలో చోరీ ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. అరుంధతీనగర్‌లో నివాసం ఉండే బాల కృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో సోమవారం రాత్రి ఎప్పటిలానే నివాసంలో నిద్రించారు. తిరిగి మంగళవారం ఉదయం లేచి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించాడు. ఇంటి ముందు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యుల సేవలు

గనికపూడి(ప్రత్తిపాడు): గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు గొట్టిపాడు పీహెచ్‌సి వైద్యాధికారి మేరి యునిస్ అన్నారు. మండల పరిధిలోని గనికపూడి యూపీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, జనరల్ మెడిసిన్ డాక్టర్ మౌనిక, ఆర్థోపెడిక్ వైద్యాధికారి డాక్టర్ ఏ హేమంత్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ శివరామకృష్ణ 137 మంది రోగులకు పరీక్షలు చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వారికి ఉచిత మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరియునిస్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష క్యాంప్‌ల ద్వారా నిష్ణాతులైన వైద్యులు వైద్యసేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎంతో సదుద్దేశ్యంతో నిర్వహిస్తున్న క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్. విజయకుమారి, కె.చెల్లమ్మ పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామి కల్యాణం



కాకుమాను: స్థానిక గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.

ప్రతి ఒక్కరికి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



రోగికి కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

తెనాలిటౌన్: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేదలకు వైద్యం అందుబాటులోకి ప్రభుత్వం తీసుకువస్తున్నట్లు తెలిపారు. రోగులకు గుండె, షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేశారు. కంటి వైద్యులు ప్రత్యేకంగా కళ్ల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందజేస్తామని చెప్పారు. వైద్య పరీక్షలు చేసిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొలకలూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ మానస, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ దేవకిలు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 400 మంది వైద్య సేవలు పొందారు. మండల విద్యాధికారి జయంతిబాబు, ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయుడు బాలు నాయక్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పిన పాటి అనిల్‌కుమార్, సూపర్‌వైజర్‌లు ప్రసన్నలక్ష్మి, వెంకటరెడ్డి, రాజయ్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటి రోజు స్వామివారిని పెళ్లి కుమారుని చేసి విశేష పూజలు చేశారు. సాయంత్రం విష్వక్సేన పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆగమ పండితులు ఎన్‌జీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఆయల కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే స్వామివారి ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు, సేవలు ఉంటాయని తెలిపారు. దీక్షతో వైఖానస ఆగమయుక్తంగా ఉత్సవాలు జరుగుతాయని అర్చకులు కిరణ్‌కుమార్, నిఖిల్ తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయనంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, మూర్తి వెంకటేశ్వరరావు దంపతులు, ఆలపాటి వీరభద్రరావు దంపతులు, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో గుంటూరు క్రీడాకారుల ప్రతిభ



సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గుంటూరు క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో గుంటూరు క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో పలు పతకాలు సాధించారని కాశీనాథ్ మార్షల్ అకాడమీ కార్యదర్శి బి.కాశీనాథ్ రెడ్డి మంగళవారం తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 400 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. తమ అకాడమీ క్రీడాకారులు 15 బంగారు, 3 రజతాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు సినీనటుడు సుమాన్ చేతుల మీదగా చాంపియన్ ట్రోఫీ అందించినట్లు పేర్కొన్నారు.